# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 30-06-2025** **సమయం : 1.20 గంటలు**

# ముఖ్యాంశాలు

**1.** క్వాంటం సాంకేతికతను అందిపుచ్చుకోవాలని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సూచించారు.

**2.** రాష్ట్రంలోని పురపాలక సంస్థల్లో చెత్త తొలగింపు, పూడికతీత పనులకు ప్రాధాన్యమిస్తున్నామని మంత్రి పి. నారాయణ తెలిపారు.

**3.** ఖరీఫ్ పంటలకు అవసరమైన సాగునీరు అందించడానికి చర్యలు తీసుకుంటున్నామని మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు పేర్కొన్నారు.

**4.** రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం పరిధిలోని ట్రిపుల్ ఐటీల్లో ప్రవేశాలకు సంబంధించిన కౌన్సెలింగ్ ప్రక్రియ ఈరోజు పారంభమైంది.

**5.** అన్నమయ్య జిల్లాలో ఈరోజు జరిగిన రహదారి ప్రమాదంలో ముగ్గురు మృతి చెందారు.

==========================

క్వాంటం సాంకేతికతను అందిపుచ్చుకోవాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సూచించారు. విజయవాడలో ఈరోజు నిర్వహిస్తున్న అమరావతి క్వాంటం వ్యాలీ జాతీయ స్థాయి కార్యశాలలో ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్‌తో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్టార్టప్ కంపెనీల ఎగ్జిబిషన్‌ను ముఖ్యమంత్రి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ....

వాయిస్ .. 35 సెకన్లు

--------------------------

రాష్ట్రంలోని పురపాలక సంస్థల్లో చెత్త తొలగింపు, పూడికతీత పనులకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నామని పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పి. నారాయణ తెలిపారు. నెల్లూరు నగరంలోని వివిధ ప్రాంతాలలో జరుగుతున్న పూడికతీత పనులను అధికారులతో కలిసి ఈరోజు పరిశీలించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వ సహకారంతో ప్రతి ఇంటికి స్వచ్ఛమైన తాగునీటిని అందిస్తామని చెప్పారు. వ్యర్థాల నిర్వహణకు చర్యలు తీసుకుంటున్నామని మంత్రి తెలుపుతూ,

వాయిస్ 35 సెకన్లు

--------------------------

ఖరీఫ్‌లో పంటలకు అవసరమైన సాగునీరు అందించడానికి చర్యలు తీసుకుంటున్నామని వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. రైతులకు సాగునీరు అందించేందుకు శ్రీకాకుళం నుంచి దృశ్య మాధ్యమం విధానంలో నీటిపారుదల శాఖ అధికారులతో మంత్రి ఈ రోజు సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, శ్రీకాకుళం జిల్లాలో వంశధార కుడి ఎడమ కాలువ ఆయకట్టు నుంచి సాగునీరును విడుదల చేయాలని అధికారులను ఆదేశించారు. గ్రామీణ ప్రాంతాల్లో అధికారులు క్షేత్ర స్థాయిలో పర్యటించి రైతులకు పంట సాగుకు అవసరమైన సూచనలు అందించాలని మంత్రి సూచించారు.

---------------------------

రైతుల సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు. తూర్పు గోదావరి జిల్లా, నిడదవోలులో వర్షాల వల్ల ఎర్రకాలువ ముంపుకు గురై పంట నష్టపోయిన రైతులకు ఇన్ ఫుట్ రాయితీ నిధులను మంత్రి ఈరోజు విడుదల చేసారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, ధాన్యం బకాయిల విడుదలకు చర్యలు తీసుకుంటామన్నారు. ఎర్రకాలువ వరద నియంత్రణకు దీర్ఘకాలిక ప్రణాళిక, శాశ్వత పరిష్కారం దిశగా ప్రణాళికలు రూపొందిస్తున్నామని చెప్పారు. ఎర్రకాలువ ఆధునికరణ పనులు త్వరలో చేపడతామని మంత్రి వివరించారు.

---------------------------

రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం-ఆర్జీయూకేటీ పరిధిలోని నూజివీడు, ఇడుపులపాయ, ఒంగోలు, శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీల్లో ప్రవేశాలకు సంబంధించిన కౌన్సెలింగ్ ప్రక్రియ ఈరోజు నుంచి ప్రారంభమైయ్యాయి. 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి ఇడుపుల పాయ, నూజివీడు ట్రిపుల్ ఐటీలకు ఎంపికైన వారికి ఈరోజు, రేపు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నామని అడ్మిషన్ల కన్వీనర్ ఎస్ అమరేంద్రకుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీకి ఎంపికైన విద్యార్థులకు జూలై 2, 3 తేదీల్లోను, ఒంగోలు ట్రిపుల్ ఐటీకి ఎంపికైన వారికి 4, 5 తేదీల్లో నూజివీడు ట్రిపుల్ ఐటీలోనే కౌన్సెలింగ్ ఉంటుందని తెలిపారు.

---------------------------

కృతిమమేధ ద్వారా నేరాల నియంత్రణకు చర్యలు తీసుకుంటున్నామని రాష్ట్ర డిజిపి హరీష్ కుమార్ గుప్తా తెలిపారు. గుంటూరు జిల్లాలోని చౌడవరంలో కృతిమమేధ-ఏఐపై రాష్ట్ర పోలీసు ఆధ్వర్యంలో నిర్వహించిన హ్యాకథాన్ ముగింపు కార్యక్రమంలో డిజిపి పాల్గొన్నారు. ఈ సందర్భంగా హ్యాకథాన్‌లో ఎనిమిది విభాగాలలో నిర్వహించిన పోటీలలో విజేతలకు 75 వేల రూపాయలు, రన్నర్లకు 50 వేల రూపాయల నగదు బహుమతులను అందించారు. హ్యాకథాన్‌లో కృత్రిమ మేధ సహాయంతో నేరాల నియంత్రణ, పర్యవేక్షణ, దర్యాప్తులోని సవాళ్లకు పరిష్కారాలను కనుగొనడం జరిగిందని హరీష్ కుమార్ గుప్తా పేర్కొంటూ,

వాయిస్ 25 సెకన్లు

---------------------------

రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రేపు తూర్పు గోదావరి జిల్లాలో పర్యటించనున్నారని జిల్లా కలెక్టర్ పి. ప్రశాంతి తెలిపారు. కొవ్వూరు నియోజకవర్గంలోని తాళ్లపూడి మండలం మలకపల్లి గ్రామంలో ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రత పింఛన్ల పంపిణీ, అనంతరం పీ4 సభలో పాల్గొంటారని చెప్పారు. ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లపై కొవ్వూరులో కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ

ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్ల విషయంలో జిల్లా అధికారులు సన్నద్ధంగా ఉండాలని సూచించారు. గ్రామ సభలో మార్గదర్శులతో, లబ్ధిదారుల కుటుంబాలతో ముఖాముఖిలో పాల్గొంటారని చెప్పారు.

-----------------------------

అన్నమయ్య జిల్లాలో జరిగిన రహదారి ప్రమాదంలో ముగ్గురు మృతి చెందారు. జిల్లాలోని కురబలకోట మండలం చెన్నామర్రి మిట్ట వద్ద టెంపోను లారీ ఢీకొట్టింది. ఈ ఘటనలో ముగ్గురు మృతిచెందగా.. 11 మందికి గాయాలయ్యాయని అధికారులు తెలిపారు. కర్ణాటకలోని బాగేపల్లికి చెందిన వారిగా గుర్తించామని చెప్పారు. వీరంతా తిరుమల దర్శనానికి వెళ్లి తిరిగొస్తుండగా ఈ ప్రమాదం చోటుచేసుకుందని క్షతగాత్రులను మదనపల్లె ప్రభుత్వాసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

మరోవైపు రోడ్డు ప్రమాదం ఘటనపై రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి విచారం వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు సంతాపం తెలిపారు.

-----------------------------

అంతర్జాతీయ గ్రహశకల దినోత్సవం ఈరోజు నిర్వహిస్తున్నారు. 1908 జూన్ 30వ తేదీన రష్యా సమాఖ్య, సైబీరియా తుంగస్కా నది సమీపంలో భూమిని అతిపెద్ద గ్రహశకలం ఢీకొట్టడంతో 2 వేల చదరపు కిలోమీటర్లకుపైగా అటవీప్రాంతం విధ్వంసానికి గురైంది. ఈ సందర్భానికి గుర్తుగా ప్రతి సంవత్సరం జూన్ 30వ తేదీన అంతర్జాతీయ గ్రహశకల దినోత్సవం నిర్వహించాలని ఐక్యరాజ్యసమితి తీర్మానం చేసింది. గ్రహశకలాల గురించి ప్రజలకు అవగాహన కల్పించేందుకు ఈ దినోత్సవం నిర్వహిస్తారు.

-----------------------------

రాష్ట్రంలోని ప్రస్తుత వాతావరణ పరిస్థితిపై అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం అధికారి జి.లక్ష్మీ ఆకాశవాణి ప్రాంతీయ వార్తా విభాగానికి వివరిస్తూ..

వాయిస్...24 సెకన్లు

-----------------------------

పన్ను చెల్లింపుదారుల సమస్యల్ని పరిష్కరించేందుకు కృషి చేస్తానని.. నరసారావుపేట పార్లమెంట్ సభ్యులు లావు శ్రీకృష్ణదేవరాయులు చెప్పారు. గుంటూరులో జరిగిన ఏపీ టాక్స్ ప్రాక్టీషనర్స్ కన్సల్టెంట్ సమావేశంలో ఆయన నిన్న పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీకృష్ణదేవరాయులు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌లో పన్ను చెల్లింపుదారులు, వస్తు, సేవల పన్ను-జీఎస్టీ కట్టే వారి సంఖ్య పెరిగిందని చెప్పారు. వారందరికి టాక్స్ ప్రాక్టీషనర్స్ గొప్ప సేవలందిస్తున్నారని ప్రశంసించారు. పన్ను చెల్లింపుదారుల సమస్యలను తన దృష్టికి తీసుకువస్తే పార్లమెంట్‌లో చర్చించి ప్రయోజనం కలిగే చర్యలు తీసుకుంటామన్నారు.

======================